క్లుప్తంగా

ఆస్పత్రిలో పనిచేయని లిఫ్టు


రోగులను వీల్‌చైర్‌లో తీసుకెళుతున్న సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మూడురోజులుగా లిఫ్ట్ పనిచేయడం లేదు. దీంతో రోగులు పై మూడు అంతస్తులకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఇక నడవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను పైకి తీసుకెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. వీల్‌చైర్‌పై తోయలేక తోసుకెళుతున్నారు. అధికారులు స్పందించి లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించాలని రోగులు వేడుకుంటున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మురళీకృష్ణ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ ఇవ్వాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీని అందించాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు సీఆర్ మహేష్ రెడ్డిని కోరారు. జిల్లాలోని పాత్రికేయుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని, ప్రతి ఏటా జర్నలిస్టుల పిల్లలకు 50శాతం రాయితీ అందిస్తున్నారని, రానున్న విద్యా సంవత్సరంలోనూ 50శాతం ఫీజు కల్పన దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రస్తుత అధ్యక్షుడు రమేష్ బాబు ప్రధాన కార్యదర్శి కాళేశ్వర్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్, కార్యనిర్వాహక కార్యదర్శి అశోక్ కుమార్, నాయకులు పవన్ కుమార్, చంద్ర శేఖర్, శివప్రసాద్, జయకర్, మహేష్, రామ కృష్ణ, సురేష్, జీకే శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యాబోధనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విద్యార్థులకు గుణాత్మక విద్యాబోధనే లక్ష్యంగా చిత్తూరులోని సంసిద్ క్యాంఫర్డ్ స్కూల్స్, టాటా గ్రూపు కి చెందిన క్లాస్ ఎడ్జ్ వ్యూహాత్మక విద్య భాగస్వామ్యంలో విద్యాబోధనకు శ్రీకారం చుట్టినట్లు సంసిద్ స్కూల్స్ నిర్వాహకులు శ్రీనివాసరావు, సి ఆర్ మహేష్ రెడ్డి తెలిపారు. చిత్తూ రు ప్రెస్‌క్లబ్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా టాటా క్లాసు ఎడ్జ్, సంసిద్ధ స్కూల్స్ విద్యాబోధన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో విలువలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు కలిగిన భవిష్యత్తు నాయకులను రూపొందించడమే విద్యా బోధన ముఖ్య ఉద్దేశం పేర్కొన్నారు. సాంకేతిక ఆధారిత తరగతులు, నాయకత్వ వికాసం, విలువల పెంపకం, విద్యా నెట్ వర్క్ విస్తరణ, భవిష్యత్ నైపుణ్య అభివృద్ధి, తాము అనుసరించే విద్యా విధానం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కాశీ ఉన్నారు.

గంగ జాతరకు ఘన చరిత్ర

- చిత్తూరులో ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహణ
- ఈ నెల 13, 14 తేదీల్లో జాతర


గంగజాతరలో అంబలి సమర్పిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) కొలువుదీరిన గంగమ్మ (ఫైల్ ఫొటోలు)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కలరా కలవరపెట్టింది. మసూచి మట్టుపెట్టింది. ప్లేగు ప్రాణం తీసింది. ఊరూరా అంటువ్యాధులు పంజా విసిరాయి. ఇక మహమ్మారుల దాటికి జనం నేలరాలిపోయారు. మృత్యువు విలయతాండవం చేసే వేళ చినుకుజాడ కనుమరుగైంది. తిండి గింజల్లేక జనం ఆకలితో అలమటించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీని నుంచి గట్టెక్కించడానికి గ్రామ దేవత ఒక్కటే మార్గమనే అప్పటి ఊరు జనం తీర్మానం చేశారు. గంగాదేవిని కొలిచారు. ఆ తర్వాత ఊరికి మంచి జరగడంతో పూర్వీకులు అమ్మవారి పండగను ఆనవాయితీ మార్చారు. ఏటా గంగ జాతర చేయడం మొదలుపెట్టారు. ఈ గంట జాతరకు చిత్తూరులో దశాబ్దాల చరిత్ర ఉంది. అంత చరిత్ర కలిగిన ఈ జాతరను ఈ నెల 13, 14 తేదీల్లో కోలాహలంగా నిర్వహించనున్నారు.

ఇది గంగజాతర చరిత్ర..

దాదాపు 350 ఏళ్ల క్రితం చిత్తూరు ఒక చిన్న గ్రామం. ఆనాడు కలరా, మసూచి, ప్లేగు వంటి ప్రాణాంతక వ్యాధులు ఊళ్లనే కబళించేశాయి. ప్రతి ఏడాది చైత్రమాసంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉండేది. దీంతో పాటు వర్షాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. కరువు రక్కసి కరాళ నృత్యం చేసింది. జనం ఆకలితో అల్లాడిపోయారు. ఇలా మానవశక్తి పూర్తిగా క్షీణించిన సమయంలో, దైవ శక్తిపై భారం వేశారు. ఊరంతా ఒక్కటై పసుపు నీళ్లు చల్లి, ఊరి హద్దుల్లో వేపాకు తోరణాలు కట్టారు. ఇక గంగా అనుగ్రహం, అమ్మను చల్లబరచాలని తీర్మానించారు. ఊరు నడివీధిలో మట్టితో చేసిన గంగమ్మ ప్రతిమను పెట్టి కొలవడం ప్రారంభించారు. దాంతో పాటు అమ్మకు ఇష్టమైన పదార్థాలు అంబలితో పాటు కుంభం పోసి బలిదానాలు ఇచ్చేవారు. ఇలా చేయడం ద్వారా అమ్మవారు శాంతించి వ్యాధులు తగ్గుముఖం పట్టడం, సంవృద్ధిగా వర్షాలు కురవడంతో గంగమ్మ కటాక్షం కోసం ఏటా జాతర ప్రారంభించడం మొదలు పెట్టారని పెద్దలు చెబుతున్నారు.

పూర్వీకుల కట్టుబాట్ల మేరకే!

ఇప్పుడు కూడా గంగ జాతర జరగాలంటే ముందు నిర్వాహకులు నిర్ణయించుకున్న తేదీకి ముందు వచ్చే మంగళవారం చాటింపు వేస్తారు. చాటింపునకు ముందు ఎల్ల దేవతల అనుమతి కోరుతారు. అక్కడ పూజలు చేసి గ్రామానికి ఎలాంటి దుష్ట శక్తులు రాకుండా ఊరుకు నలుదిక్కుల వేపాకుల తోరణాలు కడుతారు. దీంతో బయట ఉన్న జనం కూడా చిత్తూరుకు చేరుకుంటారు. ఇక్కడి జనం బయటకు వెళ్లకూడదని చెబుతుంటారు. అలాగే చాటింపు తరువాత మంచి ముహూర్తంలో గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టి అమ్మవారి అనుమతితో పాటు శాంతిపూజలు చేస్తారు. ఈ పూజలు చేసిన తరువాతే చిత్తూరు నడివీధిలో గంగమ్మను ప్రతిష్టిస్తారు. ఆ తరువాత వచ్చే మంగళవారం ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి తెర తొలగిస్తారు. ఆపై అమ్మవారికి భక్తులు ఉదయం అంబలి, రాత్రికి కుంభం పోసి దుష్టశక్తులు రాకుండా పూజలు చేస్తారు. మరుసటి రోజు సంప్రదాయ బద్ధంగా జలధికి తరలిస్తారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఓం శక్తి విన్యాసాలు వినూత్నంగా చేపడతారు.

పక్కరాష్ట్రాలు కూడా..

ఈ రెండు రోజుల జాతరను చూసేందుకు పక్క రాష్ట్రాలు కూడా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటాయి. మంగళవారం నుంచి జరిగే జాతరను తిలకించేందుకు భారీ సంఖ్యలో తరలివస్తారు. పూజలు చేయడంతో పాటు వినూత్న రీతిలో మొక్కలు చెల్లించుకుంటారు. అమ్మవారికి పెద్ద మొత్తంలో కానుకలు సమర్పించుకుంటున్నారు. నగదుతోపాటు పసుపు, కుంకుమ, చీరలు, వెండి, బంగారు ఆభరణాలు కూడా సమర్పిస్తారు. ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే చిత్తూరు గంగజాతరకు సుదూర ప్రాంతాల నుంచి జనం బంధువుల ఇళ్లకు చేరుకుంటున్నారు.

చిత్తూరుకు పెద్ద పండుగ

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఒక పండుగలో చిత్తూరు గంగజాతర ఒకటి. మూడున్నర దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన ఈ జాతర అంటే చిత్తూరు వాసులకు సంక్రాంతి తరువాత వచ్చే పెద్ద పండుగ. చిత్తూరు నగరంలోని బజారువీధి, గిరింపేట, మురకంబట్టు, కొంగారెడ్డిపల్లి, దొడ్డిపల్లి, మంగసముద్రం తదితర ప్రాంతాల్లో ఈ జాతరను అట్టహాసంగా నిర్వహిస్తారు. ఈ సారి 13, 14 తేదీల్లో ఆయా ప్రాంతాల్లో జాతర ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈజాతరను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

అమరవీరులకు నివాళి


సంఘీభావం తెలుపుతున్న సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద శనివారం స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. ముందుగా దేశ సరిహద్దులో పోరాడిన భారత ఆర్మీకి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు తాండవమూర్తి, సత్య, మురళి తదితరులున్నారు.

బకాసుర బలిబండి


బలికూడు కోసం గ్రామ వీధుల్లో ఉన్న భీమసేనుడు

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం పలు గ్రామాల్లో బకాసురునికి బలిబండి కార్యక్రమం నిర్వహించారు. వసంతాపురం, బసవాపల్లె, చెరువు ముందపూరు, పశుమంద, గుడిపాలక్రాస్, కోలావూరు, రెట్టగుంట, కట్టకిందపల్లె, దళవాపల్లె గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా భీమసేనుడు గ్రామవీధుల్లో విహరించి బలికూడు తీసుకెళ్లాడు.

12న ఉచిత కంటి వైద్య శిబిరం

తవణంపల్లె: మండల కేంద్రంలో జీసెస్ గాస్పెల్ చర్చిలో ఈ నెల 12వ తేదీన సోమవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫాస్టర్ ఏసు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగవద్గీతతో వ్యక్తిత్వ వికాసం


భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఐరాల: భగవద్గీత నేటి తరానికి వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పగలుగుతున్నదని త్రైతసిద్ధాంత, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి పేర్కొన్నారు. మండలంలోని పుల్లయ్యగారిపల్లె, నెల్లిమందపల్లె, పేరయ్యగారిపల్లె, ఎంకె పల్లె, ఎస్ కట్టకిందపల్లె, ఆవులపల్లె, తోట దండువారిపల్లె, భీమనేనివారిపల్లె, ఎల్లంపల్లె, కుమ్మరపల్లె, రెడ్డివారిపల్లె, పీ కట్టకిందపల్లె, పాలకలలో ఆయన కమిటీ సభ్యులతో కలిసి శనివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ఆది కర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ జ్ఞానమార్గం అనుసరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చాముండి, ధనుంజయ, సుమలత, కొండమ్మ, హర్షవర్ధన్, సాయితేజశ్విని, సునీల్, శ్రీదేవి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: చిన్నారుల ఎదుగుదలకు తల్లిదండ్రులు పోషకాహారం అందించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు.మండలంలోని పేయన్నగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఎండలు అధికమవుతున్న తరుణంలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి వహించాలని చెప్పారు. పండ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు విధిగా అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి


చారాలలో మహిళలకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు


కారకాంపల్లెలో బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ కేశవనారాయణ సూచించారు. మండలంలోని కారకాంపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 32 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం , ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

చారాలలో ఉచిత వైద్య శిబిరం

మండలంలోని అరగొండ మేజర్ పంచాయతీలోని చారాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మోహన్‌వేలు 37 మందికి ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఎండలో తిరిగి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రత ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుల గర్జన!

- ఉరుములు, మెరుపులు, పెనుగాలులు
- మృత్యువాత పడుతున్న జీవులు
- నేలకొరుగుతున్న చెట్లు, పంటలు



పెనుగాలులుకు కూలిపోయిన మామిడిచెట్టు, నేలరాలిన మామిడి పంట

కాణిపాకం/యాదమరి: కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆకాశం ఉరిమిందంటే చాలు రైతుల గుండెల్లో దడ పుడుతోంది. పిడుగులు పడి ప్రాణ నష్టం జరుగుతోంది. ఉరుములు, మెరుపుల సమయంలో వస్తున్న గర్జనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. యాదమరి మండలంలో పిడుగు పడి కొబ్బరి చెట్టు నేలమట్టమైంది. గతంలో పిడుగుపాటుకు పలువురు మృత్యువాత పడ్డారు. పిడుగుల ధాటికి రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. దీంతోపాటు వరిపంట నేలవాలిపోతోంది. మామిడి కాయలు రాలిపోతున్నాయి. ఇటువంటి సంఘటనలు జిల్లాలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది మే గర్జనలతో ఆరంభమైంది. సాయంత్రం అయితే చాలు భయంకరమైన ఉరుములు, మెరుపులతో భయానక వాతావరణం చోటుచేసుకుంటోంది. బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పిడుగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాతావరణ శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్లకు మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. ఎక్కడ పిడుగులు పడే అవకాశం ఉందో.. ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ సమాచారం చేరవేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. చెట్ల కింద తల దాచుకోవడం సరికాదని అంటున్నారు. ముఖ్యంగా మోటార్ స్విచ్ ఆన్ చేయడం వంటివి చేయకూడదు. ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు బలమైన ఈదురు గాలులు ఉండడం పరిపాటి. ఈ తరుణంలో పంటను కాపాడుకోవడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

దయనీయ స్థితిలో మామిడి రైతులు

సంప్రదాయ పంటలైన వరి, చెరుకు, వేరుశనగ పంటలతో నష్టాలు పాలవుతున్నారని, వాణిజ్య పంట అయిన మామిడిపై ఎన్నో ఆశలతో రైతులు ఈ పంటపై మొగ్గు చూపారు. తమ కష్టాలు తీరుతాయని ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు ప్రత్యామ్నాయ పంటగా మామిడి పంటలను సాగు చేయాలని అధికారులు ప్రోత్సహించారు. ఈ ఏడాది వాతావరణ మార్పుల కారణంతో పంట దిగుబడులు భారీగా తగ్గడంతో తీవ్రంగా ఆందోళనలో కూరుకుపోయారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి వరుసగా కురుస్తున్న అకాల వర్షాలు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. నేల రాలిన మామిడిని కిలో రూ.మూడు నుంచి రూ.నాలుగు వరకు మండి యజమానులు, దళారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతుల పరిస్థితి దయనీయ స్థితికి చేరుకుంది.

ఇలా చేయాలి

- ఆకాశంలో ఉరుములు, మెరుపులు చూస్తే 30 నిమిషాలు ఇంట్లోనే ఉండాలి.
- శరీరం జలదరింపుతో మెడ వెనుక భాగంలో వెంట్రుకలు లేచి నిలబడితే మెరుపు లేదా పిడుగు పడే సమయం ఆసన్నమైందని గ్రహించాలి.
- ఆ సమయంలో చెరువులు, సరస్సులు, నీటి కుంటల్లో ఉన్నా, సమీపంలో ఉన్నా దూరంగా వచ్చేయాలి.
- విద్యుత్ ప్రసరింపజేసే అన్ని యుటిలిటీ లైన్లు, వస్తువుల నుంచి దూరం కావాలి. ఫోన్, పవర్, మెటల్, కంచెలు, హెడ్‌ఫోన్స్, రైల్వే ట్రాక్స్, విండ్ మిల్లులు, చెట్లు, ఎత్తయిన కొండలకు దూరంగా ఉండాలి.

ఆరుబయట చేయకూడనివి

- ప్రతికూల వాతావరణంలో ఆరుబయటకు వెళ్లకూడదు.
- ఆరుబయట, అటవీ ప్రాంతంలో ఉంటే చిన్న, మరుగుజ్జు చెట్ల కింద ఆశ్రయం పొందాలి. పెద్ద పెద్ద చెట్ల కింద ఉండరాదు.
- విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, వాహనాలు, ఎలక్ట్రిక్ వస్తువులు, కంచె తీగలు, యంత్రాలకు దూరంగా ఉండాలి. ఇవి మెరుపులను ఆకర్షిస్తాయి.
- సురక్షిత స్థలాలకు వెళ్లడానికి తగినంత సమయం లేకుంటే నేలపై బంతిలాంటి భంగిమలో చెవులు మూసుకొని తలను నేలకు తగలకుండా మోకాలిపై కూర్చోవాలి. మిమ్మల్ని మీరు చిన్న లక్ష్యంగా చేసుకోవాలి.

ఇంట్లో ఉన్నప్పుడు..

- హెచ్చరికల అప్‌డేట్స్, హెచ్చరిక సూచనల కోసం సమాచారాన్ని తెలుసుకోవాలి.
- తలుపులు, కిటికీలు, వరండాలకు దగ్గరగా ఉండకూడదు. విద్యుత్ వాహకాలకు దూరంగా ఉండాలి.
- మెరుపుల సమయంలో ఇంటిలోని ఎలక్ట్రిక్ పరికరాలను ఉపయోగించకుండా అన్‌ప్లగ్ చేయాలి.
- మెరుపుల సమయంలో స్నానాలు చేయకూడదు. గిన్నెలు కడగరాదు. ప్రవహిస్తున్న నీటితో ఏ పనీ చేయవద్దు.

ప్రథమ చికిత్స తప్పనిసరి



పిడుగు పాటుకు గురైన వ్యక్తిని తాకవచ్చు. పల్స్ కోసం బాధితుడి దవడ కింద, మెడపై చేయి పెట్టి చూడాలి. శ్వాస గుర్తింపునకు కరోటిడ్ ధమని ఉత్తమమైన ప్రదేశం. బాధితుడు శ్వాస తీసుకోలేకపోతే వెంటనే నోటితో గాలి ఊదాలి. బాధితుడ్ని త్వరగా ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించాలి. – వెంకటప్రసాద్, వైద్య నిపుణులు, చిత్తూరు

కార్మిక సమస్యలు పట్టని ప్రభుత్వం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్

చిత్తూరు కార్పొరేషన్: కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరిధర్‌గుప్తా, సురేంద్రన్ తెలిపారు. యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లేబర్‌కోడ్ వల్ల కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. కార్మికులు కూడా అదే ఉత్సాహంతో మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు మాట్లాడారు. కార్మికుల హక్కులకు లేబర్ కోడ్ గొడ్డలిపెట్టువంటిదన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు మాట్లాడారు. మూడు వారాలుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధర్నా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, గోవిందప్ప, గంగా, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య అన్నారు. రామభద్రాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. షుగర్, బీపీ, గర్భవతులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంటికే పరిమితమైన వారిని ఇళ్లవద్దకు వెళ్లి వైద్యం అందించారు. వైద్యసిబ్బంది చంద్రశేఖర్, కాంచన, శివగామి, ప్రవీణ్, మార్క్ పాల్గొన్నారు.

బురదగుంట కాదు .. రోడ్డే


రాగిమానుపెంట పంచాయతీ కార్యాలయం వద్ద రహదారిపై నిలిచిన నీరు

బంగారుపాళెం: మండలంలోని బంగారుపాళెం–రాగిమానుపెంట రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దీంతో గ్రామస్తులు అవస్థల ప్రయాణం సాగించాల్సి వస్తోంది. రోడ్డు గుంతలమయంగా మారడంతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు చెరువును తలపిస్తోందని గ్రామస్తులు వాపోయారు. బంగారుపాళెం నుంచి రాగిమానుపెంట రోడ్డు మార్గంలో 20 గ్రామాలకు చెందిన గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వాన్నంగా మారడంతో బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు సాగించేవారికి అవస్థల ప్రయాణం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలమయంగా ఉన్న బంగారుపాళెం–రాగిమానుపెంట రోడ్డును బాగుచేయాలని పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితంలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఇందిరమ్మ కాలనీ వద్ద గుంతలమయంగా రాగిమానుపెంట రోడ్డు